

# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గురువారం 05 మార్చి 2026 పేజీలు : 04




## బ్రహ్మగరుడ వాహనంపై దర్శనం ఇచ్చిన శ్రీవారు

**కదిరి, మార్చి 4 ప్రభాతవార్త**

ప్రముఖ ప్రసిద్ది గాంచిన శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారికి బ్రహ్మగరుడ సేవ నిర్వహించారు. ఈ ఉత్సవానికి ఎనలేని ప్రాముఖ్యత ఉంది. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనం అయిన గరుత్మంతున్ని నరసింహుడికి వాహనంగా పంపుతారని భక్తుల నమ్మకం. అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మగరుడ సేవ అని పిలుస్తారు. ఉదయం నిత్య పూజలు, హోమాలు అనంతరం శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహించి సాయం సంధ్య వేల గరుధ దంఢం ప్రతిష్టించిన అనంతరం శ్రీవారిని తిరువీధుల్లో విహరింప చేశారు. శ్రీవారిని దర్శింపజేసుకోవడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. నరసింహ నామస్మరణంతో పుర వీదులు మారుమ్రోగాయి.

**నేడు శేష వాహనంపై దర్వనం ఇవ్వనున్న శ్రీవారు :**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శేష వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉదయం నిత్య పూజలు, హోమాలు అనంతరం గ్రామోత్సవం నిర్వహించి సంధ్య సమయంలో శేష వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

← బ్రహ్మ గరుడుపై భక్తులకు దర్శనం ఇస్తున్న శ్రీవారు

## యాడికి చెన్నకేశవస్వామి భూముల కోసం ఆక్రమించిన వారి కాళ్లు పట్టుకొని వెనక్కి ఇవ్వమని కోరుతాం

**-భూముల కోసం లీగల్‌గా వెళితే ఇల్లీగలే**
**-గడ్డం నాలో ఆధ్యాత్మికత భావాన్ని పెంచింది**
**-మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి**



జె.సి ప్రభాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

**తాడిపత్రి అర్బన్, మార్చి 4 ప్రభాతవార్త**

యాడికి లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించి 1200 ఎకరాల భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని వాటిని ఆక్రమించుకున్న వారు ఆలయానికి స్వాధీనం చేసేందుకు వారి కాళ్ల పట్టుకోవడానికి అయినా సిద్ధమని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం యాడికిలోని లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయడానికి కృషిచేసిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిని ఆలయ అర్చకులు హరిస్వామి జె.సి నివాసంలో ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి జె.సి ప్రభాకర్‌రెడ్డి కృషి చేశారని ఆయన యాడికి ప్రజలతో మాట్లాడి అందరిని భాగస్వాములు చేసి సమిష్టి నిర్ణయంతో ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందని ఆయన ఆశీస్సులు ఉంటే స్వామివారి ఉత్సవాలు ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యాడికిలో ఉన్న అన్ని కులాల నుంచి విద్యావంతులు పనిచేయడానికి ఉత్సాహంగా ఉన్నవారిని ముగ్గురి చొప్పున ఎంపిక చేసి వారందరి సహకారంతోనే ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ ఉత్సవాలకు ఎవరు నాయకత్వం వహించలేదని యాడికి ప్రజలే ముందుండి నడిపించాలన్నారు. స్వామివారికి 1200 ఎకరాల భూములు ఉన్నాయని అవన్నీ అన్యాక్రాంతం అయ్యాయని వాటిని స్వాధీనం చేయాలంటే ఆక్రమించుకున్నవారు ఇవ్వడానికి సిద్ధంగా లేరన్నారు. వారందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసి స్వామివారి భూములను స్వామివారికి ఇచ్చే విధంగా చూస్తానన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా స్వామివారి భూములను స్వాధీనం చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు.



మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

కొంతమంది స్వామివారి భూములు ఆక్రమించుకున్న వారు కోర్టుకు వెళ్లాలని ప్రయత్నిస్తున్నారని వారు లీగల్‌గా వెళితే నేను ఇల్లీగల్‌గా ముందుకు వెళతానన్నారు. ఆలయ భూములకు సంబంధించిన అన్ని రికార్డులు తన వద్ద ఉన్నాయని భూములు ఆక్రమించుకొని భవనాలు నిర్మించుకున్న వారు కేవలం విద్యుత్ బిల్లులు, డోర్ నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. అవన్నీ చెల్లవని ఆక్రమించుకున్న వారితో సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి ఏడాది స్వామివారికి ఉత్సవాలు చేయాలంటే డబ్బులు బిక్షం ఎత్తుకోవాల్సిన అవసరం వస్తుందన్నారు. ఇన్ని వందల ఎకరాలు ఉన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న డబ్బులు ఎంతో అవసరం అన్నారు. డబ్బులు కావాలంటే స్వామి వారి భూములు ఆక్రమించుకున్న వారి నుంచి భూములు స్వాధీనం చేసుకొని ఆలయానికి అప్పగిస్తే వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధితో పాటు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలియజేశారు.






**సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి** 4

## మార్చిలోనే మండిపోతున్న ఎండలు..!

**-బయట భరించలేని వేడి..ఇంట్లోకొస్తే ఉక్కపోత**
**-వేసవి తాపానికి ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు**
**-బస్ షెల్టర్లులేక అవస్థలు పడుతున్న ప్రయాణీకులు**
**-నీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయని పంచాయతీ**



ఉరవకొండలో మధ్యాన్నం 1 గంటల సమయంలో ప్రధాన రోడ్డులో రద్దీ లేని దృశ్యం

**ఉరవకొండ, మార్చి 4 ప్రభాతవార్త**

బయటకు వెళితే విపరీతమైన వేడి..ఇంట్లో చూస్తే భరించలేని ఉక్కపోతతో ప్రజలను సతమతమవుతున్నారు. గత వారం రోజులుగా వేసవి ఎండలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో ప్రజలు మోదలు పశు పక్షాదులు సైతం ఉకి ్కరిబిక్కిరవుతున్నాయి. ఉదయం 8 గంటలు దాటిన తరువాత ఎండ ప్రతాపం చూపుతుండగా 10 గంటలు దాటితేచాలు బయటకు వెళ్లడానికి ప్రజలు జంకే పరిస్థితులు నెలకొంటున్నాయి. మధ్యాన్నం ఒంటి గంట దాటితే చాలు సాయంత్రం 6 గంటల వరకు జన సంచారం తగ్గిపోయి ప్రధాన కూడళ్ళన్నీ వెలవెలబోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని కూలీలు, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునేవారు, ఉద్యోగ రిత్యా ఒక ఊరి నుండి మరో ఊరికి వెళ్లాల్సినవారి ఇబ్బందులు వర్ణణాతీతంగా మారుతున్నాయి. ఎండతీవ్రలు పెరిగిపోతుండటంతో శీతలపానీయాలకు డిమాండ్ పెరుగుతోంది. కలింగర కాయలు, కర్బూజా, చెరుకు రసం, పచ్చి టెంకాయలు విక్రయించే దుఖానాలతోపాటు ఐస్‌క్రీం పార్లర్లు జనంతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా సేదతీరడానికి ఒక చెట్టు కూడా లేకపోవడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడక తప్పడంలేదు. అంతే కాకుండా ప్రధాన కూడళ్లలో ఎక్కడా ప్రయాణీకుల కోసం బస్ షెల్టర్లు సైతం ఏర్పాటు కాకపోవడంతో ప్రయాణీకుల ఇబ్బందులు వర్ణణాతీతమని చెప్పాలి. ముఖ్యంగా గుంతకల్లు రోడ్డులో సులభా కాంప్లెక్ పక్కన బస్టాప్‌లో బస్సుల కోసం ప్రయాణీకులు పిల్లా పాపలతో ఎండలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండగా వారి ఇబ్బందులు అన్నీ..ఇన్నీ కాదని చెప్పాలి. బస్ షెల్టర్లు లేని ప్రదేశాల్లో ఎండ వేడిమికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చలువ పందిళ్లు లేదా షామియానాలు ఏర్పాటుచేసి ప్రయాణీకులకు తాగునీటి సౌకర్యం కల్పించడంతోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. మార్చి నెల ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. వడదెబ్బ తగిలి ప్రాణంమీదకు తెచ్చుకోక మునుపే ప్రజలు సరైన జాగ్రత్తలు తీసుకొని వైద్యుల సూచలను పాటించాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు ఉరవకొండలో మేజర్ గ్రామ పంచాయతీ ద్వారా నీటి చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## ఆశలకు గాలం..అరచేతిలో వైకుంఠం..!

**- అడ్డదారిలో ఉత్తీర్ణత సాధించవచ్చని విద్యార్థులకు వల**
**- ఆశచూపి అధికవసూళ్లకు పాల్పడుతున్న అధ్యయన కేంద్రాలు**
**- సార్వత్రిక విద్య ముసుగులో ఏటా రూ.50 లక్షల వ్యాపారం**



ఆశల వలలో చిక్కి విలవిలలాడుతున్న విద్యార్థి

**తాడిపత్రి, మార్చి3, ప్రభాతవార్త**

విద్య, వికాసం, సాధికారత అనే సంకల్పంతో రూపు దిద్దుకున్న సార్వత్రిక విద్య అక్రమ సంపాదనకు రాచమార్గం చూపుతోంది. కొన్ని సార్వత్రిక విద్య అధ్యయన కేంద్రాలు అక్షరాన్ని కూడా అంగడి సరుకును చేస్తామని, పచ్చకాగితాలు వెదజల్లితే చాలు పరీక్ష కాగితాలు అవే నిండిపోతాయనే ధోరణిని విద్యార్థులకు నూరి పోస్తున్నాయి. చూచిరాతలు, వక్రమార్గంలో తెచ్చుకునే ఉత్తీర్ణత పత్రాలు భావి జీవితంలో ఏ మేరకు ఉపయోగపడతాయో, తమలో పట్టు ఎంత ఉంటుందో విద్యార్థులే ఆలోచించుకోవాలి. కొన్ని సార్వత్రిక విద్య అధ్యయన కేంద్రాలు విద్యార్థులకు ఊరికనే ఉత్తీర్ణులను చేస్తామనే ఆశల వల విసిరి ప్రభుత్వ రుసుములకు పది రెట్లు ఎక్కువ సొమ్మును వసూలు చేస్తున్నాయి. ఉత్తీర్ణతపై అరచేతిలో వైకుంఠం చూపుతుండటంతో విద్యార్థులు ఆ ఆశల వలకు చిక్కి..ఆ స్థాయిలో పరీక్షలు జరగక విలవిలలాడుతున్నారు. తమకు చెప్పే నిర్వహకుల మాట నీటి మీద రాతేనని తెలుసుకునే లోగా కాలం, కాసులు కరిగిపోతున్నాయి. వేలకు వేలు చెల్లించుకున్నాక అంతా మాయాజాలమని తెలిసిపోవడంతో అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

**- రూ. వెయ్యికి రూ. పదివేలు..!**

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్య విధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఒక్కో సబ్జక్టుకు రూ.150 లు వంతున 5 సబ్జక్టులకు రూ.750 లు, పరీక్ష రుసుము రూ.200లు లెక్కన మొత్తం రూ.950 లు ఖర్చు అవుతుంది. అయితే ఈ అధ్యయన కేంద్రాలు ఒక్కో విద్యార్థి నుంచి రూ. 10 వేలు మొదలు రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఎందుకంటే ఈ మొత్తం చూచిరాతకు అనుమతించే అందరు అధికారులకు చెల్లించాల్సి ఉంటుందని నిర్వహకులు చెబుతుండటం విశేషం. ప్రస్తుతం తాడిపత్రి ప్రాంతంలో ఒక్క తాడిపత్రి పట్టణంలోనే ఏడు అధ్యయన కేంద్రాలు, యాడికి, పెద్దపప్పూరు మండలాల్లో ఒకటేసి చొప్పున ఉన్నాయి. వీటి ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి రూ. 520 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ లెక్కన వీరి నుంచి రూ. 52 లక్షలకు పైగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు వీరి నుంచి కేవలం రూ. 4.94 లక్షలు మాత్రమే వసూలు చేయాలి. అయితే విద్యార్థులకు అరచేతిలో వైకుంఠం చూపి రూ. 47 లక్షలకు పైగా అదనంగా వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. అధ్యయన కేంద్రాలపై విద్యాధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ లేకపోవడంతో ప్రయివేటు విద్యాలయాల్లోని అధ్యయన కేంద్రాలు ఆడింది ఆట పాడింది పాటగా చలామణి అవుతోంది. విద్యార్థులు చెల్లించిన పది రెట్ల సొమ్ముకు ఈ అధ్యయన కేంద్రాలు ఎలాంటి రసీదులు ఇవ్వకపోవడంతో విద్యార్థులు, వారి తల్లదండ్రులు ఈ అవకతవకలపై ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది. గ్రామ వార్డు సచివాలయాల్లోనూ, ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత రుసుముకే ప్రవేశం పొందే అవకాశం ప్రభుత్వం కల్పించినా..అధ్యయన కేంద్రాల అడ్డదారి ఉత్తీర్ణతను నమ్మి విద్యార్థులు వేలకు వేలు మోసపోతున్నారు.




పరీక్షలు పకడ్బంధీగా నిర్వహిస్తామంటున్న అధికారులు

**- పరీక్షల పకడ్బంథీ నిర్వహణతో..**

ఈ ఏడాది ఎన్నడూ లేనంతగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బంధీగా నిర్వహిస్తున్నారు. తాడిపత్రి ప్రాంతంలోని 9 అధ్యయన కేంద్రాల నుంచి ప్రవేశాలు పొందిన 520 మంది విద్యార్థులకు తాడిపత్రి పట్టణంలోని ట్రిబుల్ ఎస్ ఎమ్ఆర్ఎమ్, ప్రకాశం మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల పర్యవేక్షకుల నియామకం రాష్ట్ర స్థాయి అధికారులే చేపట్టడం, చూచిరాతకు, బై కాండిడేట్‌కు అవకాశం లేకుండా పోవడంతో వేలకు వేలు చెల్లించిన విద్యార్థులు విలవిలలాడుతున్నారు. సాధారణ ఇంటర్ పరీక్షల స్థాయిలో నిర్వహిస్తుండటం అంతంత సొమ్ము చెల్లించి మోసపోయామని విద్యార్థులు ఆవేదనకు గురవుతున్నారు. ఈ సారి కాకపోతే వచ్చే ఏడాదైనా న్యాయం చేస్తామంటూ నిర్వహకులు విద్యార్థులకు సర్దిచెబుతుండటం విశేషం. 2025 మార్చిలో 53.12% ఉత్తీర్ణత సాధిస్తే 2025 మేలో 66.73% ఉత్తీర్ణతను సాధించడాన్ని సాకుగా చూపి ఈ ఏడాది కూడా మేలో అందరూ ఉత్తీర్ణులవచ్చనే ఆశను విద్యార్థుల్లో నిర్వహకులు కల్పించే ప్రయత్నం చేస్తుండటం విశేషం.




ప్రవేశ పత్రంలో విద్యార్థి ఫోటో తారుమారు చేసిన నిర్వహకులు

**- గతం కంటే భిన్నంగా..పకడ్డంథీగా..!**

గతం కంటే భిన్నంగా, ప్రశాంతంగా ప్రస్తుతం దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు, ఒకరి బదులు మరొకరు వచ్చి పరీక్షలు రాయకుండా పర్యవేక్షకులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు. ఛీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులను కూడా రాష్ట్రస్థాయి అధికారులే నియమించడం జరిగిందని, ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి విజయకుమారి తెలిపారు.

## ప్రత్యేక కౌంటర్లలో పన్నులు చెల్లించండి

**-ఐదు ప్రాంతాల్లో కౌంటర్లు ఏర్పాటు చేశాం: కమిషనర్**

**అనంతపురం, మార్చి 04, ప్రభాతవార్త**

నగర ప్రజల సౌలభ్యం కోసం ఆస్తిపన్ను, నీటిపన్ను చెల్లించడానికి ఐదు ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జస్వంత రావు పేర్కొన్నారు. ఈ నెలాఖరులోపు పన్ను చెల్లించడానికి గడువు వుందని, ప్రజలు ఇబ్బంది పడకుండా ఆయా పరిసర ప్రాంతాల్లో వున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కౌంటర్లు సెలవు దినాల్లో కూడా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు పనిచేస్తాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లించడానికి హెచ్‌టిటిపిఎస్://సిడిఎంఎ.ఎపి.జిఒవి.ఇన్/ వెబ్‌సైట్‌లో క్రెడిట్, డెబిట్ కార్డులు, నెట్‌బ్యాంకింగ్, యుపిఐ ద్వారా చెల్లించవచ్చని, డిడి రూపంలో సైతం అందజేయవచ్చన్నారు. సకాలంలో నగర ప్రజలు పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి భాగస్వాములు కావాని ఆయన విజ్ఞప్తి చేశారు. వేణుగోపాల్ నగర్ (5వ సచివాలయం), పాతవూరు (17వ సచివాలయం), శ్రీనగర్ కాలనీ (52వ సచివాలయం), రామ్‌నగర్ (54వ సచివాలయం), రెండవ రోడ్డులోని స్టడీ పార్కు పక్కన వున్న (64వ సచివాలయం)లల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



కమిషనర్ జస్వంత రావు

### ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలు

## అమలు చేయకపోతే తీవ్ర పరిణామాలు

**- హామీల అమలు కోసం పోరాటాలు తప్పితే మరో మార్గం లేదు**
**- అంగన్వాడీలు, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో వైసిపి భాగస్వామ్యం అవుతుంది**
**- ఎన్నికల్లో హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక విస్మరించడం చంద్రబాబుకు మామూలే..!**
**- పోలీస్‌శాఖలో కొందరు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు**
**- అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు కమీషన్లు ఇవ్వలేక పారిశ్రామిక వర్గాలు వెళ్లిపోతున్నారు**
**- అనంతపురం వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి**




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, మార్చి 3 ప్రభాతవార్త బ్యూరో**

ఎన్నికల సమయంలో టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు కలిసి ఉమ్మడిగా హామీలు ఇచ్చాయని వాటిని అమలు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని అనంతపురం వైసిపి జిల్లా అధ్యక్షులు, సీనియర్ నేత అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. అంగన్వాడీలతోపాటు ఆశా కార్యకర్తల ఆందోళనలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యం అవుతుందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కోసం పోరాటాలు తప్పితే మరో గత్యంతరం లేదని ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చాక విస్మరించడం చంద్రబాబుకు అలవాటేనని ఆయన విమర్శించారు. బుధవారం అనంతపురంలోని వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి సీఎం అయ్యాక హామీలను అమలు చేయలేదని అరకొరగా అమలు చేసిన పథకాల్లో కూడా లబ్దిదారుల్లో కోత పెట్టారని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, ఈ రోజు వాటిని అమలు చేయాలని అడిగితే డైవర్ట్స్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే సోషల్‌మీడియా యాక్టివిటీలపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. గత ఎన్నికల ముందు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు అనేక హామీలు ఇచ్చారని కూటమి ప్రభుత్వం వచ్చి 21 నెలలు అవుతున్నా అమలు చేయలేదని ఆయన ఎత్తి చూపారు. అంగన్వాడీల వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు గ్రాటిట్యూట్ చెల్లించాలని తదితర డిమాండ్లతో విజయవాడలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం వ్యవహరించిన తీరు దారుణమన్నారు. చర్చలకు పిలుస్తామని చెప్పి తెల్లవారు జామున శిభిరాల్లోకి దూరి దాడులు చేస్తారా, మహిళలు అని చూడకుండా లాఠీ చార్జీ చేయడం ఏంటి ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని

మిగతా 3లో...

## ఉత్కంఠ భరితంగా రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలు

**- మొదటి రౌండ్లో ఆసక్తికరంగా ఫలితాలు -నేటి నుంచి మళ్లీ ఓట్ల లెక్కింపు**



ఎపి హైకోర్టు

**అనంతపురం, మార్చి 4, (ప్రభాతవార్త బ్యూరో)**

రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలు ఆసక్తిని రేకిస్తున్నాయి. హోలీ పండుగతో బుధవారం ఓట్ల లెక్కింపు జరగలేదు. గురువారం నుంచి ఓట్ల లెక్కింపు ప్రాధాన్యత ఓట్ల పరంగా తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులకు జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేసుకోవడం, వివిధ జిల్లాల్లో ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుల స్థానాలకు ఓట్ల లెక్కింపులో భాగంగా గత మంగళవారం రాత్రి తుది ఫలితాలను బట్టి మొదటి రౌండ్లో ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి . అజయ్ కుమార్ చలసాని ( విజయవాడ) 2121, చిదంబరం. కె ( ఏపీ హైకోర్టు) 1290, రామిరెడ్డి ఆలూరు ( అనంతపురం) 1289, బ్రహ్మారెడ్డి. వి ( గుంటూరు) 1056, బాలాజీ ఎలమందల(ఏపీ హైకోర్టు)1021, సుమంత్ ఎన్వి ( ఏపీ హైకోర్టు) 918, శాంత కుమార్ (గుంటూరు) 912, కృష్ణారెడ్డి (ఏలూరు) 836, చంద్రశేఖర్ రెడ్డి (నెల్లూరు)813, రామారావు గంటా (ఏపీ హైకోర్టు) 740, వెంకటరమణమూర్తి బండారు (విశాఖపట్నం) 725, శ్రీనివాసరెడ్డి కొమ్మినేని ( ఏపీ హైకోర్టు) 717, వెంకట్రామిరెడ్డి కొవ్వూరు, ఏపీ హైకోర్టు) కోర్టు 691 ఓట్లు వచ్చాయి, ఈ విధంగా మిగిలిన అభ్యర్థులకు కూడా మొదట్లో ఓట్లు పోలయ్యాయి..

02ATP27_02ATP27.qxd 04-03-2026 PM 10:36 Page 1



## రైతుల క్షేమం కోసమే పప్పు శెనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు : కాలువ భరత్

కనేకల్లో మార్చి 04 ప్రభాతవార్త



పప్పు సెనగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాల్వ భరత్

ఏపీ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో బుధవారం కనేకల్లు మండల కేంద్రంలో పప్పుసెనగ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలువ భరత్ చేతుల మీదుగా ప్రారంభించారు. పప్పు సెనగ క్వింటాలు కనీస మద్దతు ధర 5875 గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనయుడు కాల్వ భరత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. రాయదుర్గం నియోజకవర్గం పరిధిలోని కనేకల్లు మండల మండలంలో 23,604 ఎకరాల విస్తీర్ణంలో రైతులు పప్పుసేనగ సాగు చేశారన్నారు. ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేశారన్నారు. ఇప్పటి వరకు 89 మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్లో గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ను ఏర్పాటు చేసిందన్నారు.ఒక్కో రైతు నుండి గరిష్టంగా 40 క్వింటాళ్లు చొప్పున కొనుగోలు చేస్తారని సూచించారు. ప్రైవేట్ వ్యాపారులు, దళారీలకు పంట ఉత్పత్తులు విక్రయించి మోసపోకుండా రైతులు జాగ్రత్త వహించాలన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని యువ నాయకుడు కాలువ భరత్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత్ రెడ్డి మాజీ చైర్మన్ ఎస్కె మల్లికార్జున మండల కన్వీనర్ వన్న రెడ్డి మాజీ కన్వీనర్ లాలెప్ప సుదర్శన్ క్లస్టర్ ఇంచార్జ్ ఆనందరాజు మార్కెట్ యార్డ్ సభ్యులు చాంద్ భాష సొసైటీ బ్యాంకు అధ్యక్షులు చంద్రశేఖర్ గుప్తా చెరువు సంఘం అధ్యక్షులు బిటి రమేష్ వేలూరి మరియప్ప అశోక్ కవిటి మాబు తదితరులు పాల్గొన్నారు

## పంచాయతీ అభివృద్ధి అధికారులతో డిఎల్‌డీఓ ప్రత్యేక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌డిఓ

బ్రహ్మసముద్రం మార్చి 4 ప్రభాతవార్త

మండలకేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంనందు డిఎల్‌డిఓ నాగేశ్వరరావు పంచాయతీ అభివృద్ధి అధికారులతో వివిధ అంశాలపై రివ్యూ సమావేశం నిర్వహించారు సమావేశం నందు బ్రహ్మసముద్రం మండలానికి సంబంధించి అన్ని గ్రామపంచాయతీలలో పన్నులు మరియు పన్నేతరములు వసూళ్లపైన, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పైన గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా రూపకల్పన పైన రివ్యూ సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ప్రతి ఇంటికి ఇంటి పన్ను ప్రజలు కట్టేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశం నందు డి ఎల్ డి ఓ నాగేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో యోగేష్, మండల స్వర్ణ సచివాలయ అధికారి సమీర్ ఖాన్ మరియు పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## కోనాపురంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన సర్పంచ్

బ్రహ్మసముద్రం మార్చి 04 ప్రభాతవార్త



భూమి పూజ చేస్తున్న సర్పంచ్

మండలంలోని నంతేకొండావురం పంచాయతీ లో కోనాపురం గ్రామంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు శ్రీరామలు సూచన మేరకు స్థానిక సర్పంచు మల్లెల వనిత మల్లి బుధవారం కూటమి నాయకులతో కలిసి సీసీ రోడ్స్ కు భూమి పూజ చేశారు గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలియజేశారు గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు ప్రజలు అందిస్తున్న సహకారం మరవాలేనిది అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు దండు తిప్పేస్వామి పాపం పల్లి తిప్పేస్వామి హనుమంత రాయుడు దండు కరేగాడు గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ పై వైసీపీ పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

### కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు వైసీపీ కన్వీనర్ యంయస్ హనుమంత రాయుడు పిలుపు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

శెట్టూరు, మార్చి 04 ప్రభాతవార్త

ఆర్డీటీ యఫ్ సీఆర్ఏను కేంద్ర ప్రభుత్వం వెంటనే రెన్యూవల్ చేయాలని కళ్యాణదుర్గం వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య కుందిర్పి మండల కేంద్రంలో ఈనెల10వ తేదీన ఫాదర్ గుడివద్ద చేపట్టిన లక్ష పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ కన్వీనర్ యంయస్. హనుమంత రాయుడు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా బుధవారం స్థానిక ఆర్డీటీ పాఠశాల వద్ద విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ ...ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఏ రెన్యూవల్ చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా ఈ ఉద్యమం ద్వారా బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందన్నారు. కావున ప్రతి ఒక్కరూ చేయచేయి కలిపి ఉద్యమాన్ని ఉధృతం చేసే బాధ్యత ప్రతిఒకరూ తీసుకొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ శ్రేణులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమనాథ్ రెడ్డి , బోయ తిప్పేస్వామి చటాకుల రామాంజనేయులు,శ్యాంసుందర్ చౌదరి, బోయ వీరాంజనేయులు టైలర్ వన్నూరు స్వామి, లింగప్ప, చెవులు కిష్టప్ప, హరినాథ్ రెడ్డి,బాలు, సుధాకర్, కిష్టప్ప మల్లెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

రామగిరి, మార్చి 4 ప్రభాతవార్త

మండలంలోని గరిమేకలపల్లి గ్రామానికి చెందిన హరిజన అక్కమ్మ బుధవారం తెల్లవారు జామున క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నంకు పాల్పడింది. అక్కమ్మ తన కుమారుడితో గొడవపడి మనస్థాపానికి గురై ఆత్మహత్యయత్నంకు పాల్పడిందని గ్రామస్తులు తెలిపారు. ఈమెను వెంటనే కర్ణాటకలోని పావగడకు తీసుకెళ్లగా పరిస్థితి ప్రమాదకరంగా ఉందని తుంకూర్ ఆసుపత్రికి తరలించారు.

## తేరు షెడ్ నిర్మాణానికి మాజీ చైర్మన్ విరాళం



విరాళం అందిస్తున్న అనిల్ కుమార్

హిందూపురం టౌన్ మార్చి 4 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ పేట వెంకటరమణ స్వామి దేవాలయం తేరు షెడ్డు నిర్మాణానికి మున్సిపల్ మాజీ చైర్మన్ జె వి అనిల్ కుమార్ రూ. 54,999/ అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్ చంద్రకు బుధవారం ఈ విరాళాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

### స్థానిక నాయకుల ద్వారా ఒక్కొక్కరికి 50 వేల చొప్పున అందజేత



బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం టౌన్ ,మార్చి 4, ప్రభాతవార్త

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో ని గూబనపల్లి వద్ద ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టడంతో ముదిగల్లు గ్రామానికి చెందిన చాకలి శివకుమార్, చంద్రకళ, హనుమంత రాయుడులు కొద్ది రోజుల క్రితం మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈమేరకు నేడు స్థానికనాయకుల ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ. 50 వేల చొప్పున మొత్తం 1.50 లక్షల రూపాయల తన సొంత నిధులను అందించారు. అంతే కాకుండా తెలుగుదేశం పార్టీ కూడా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని శ్రీనివాసులు రెడ్డి, మాజీ కౌన్సిలర్ ధనుంజయ, మాజీ డీలర్ల సంఘం అధ్యక్షుడు గౌని మంజునాథ్ రెడ్డి, ఊటంకి రామాంజనేయులు, బంట్రోతు మంజు, బంట్రోతు పెద్ద మంజు, డీలర్లు రాజశేఖర్, వెంకటేషులు, అంగడి రామలింగ, బెందుల రామాంజనేయులు, ప్రకాష్, గుర్రప్ప గారి రామంజి, చాకలి నాగభూషణ, చాకలి వన్నూరుస్వామి, చాకలి ఎర్రిస్వామి, వడ్డే తిమ్మరాజు, వడ్డే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీటీ కోసం లక్ష పోస్ట్ కార్డుల ఉద్యమానికి వైసిపీ శ్రీకారం

### కంబదూరులో జరిగిన మీడియా సమావేశంలో పిలుపునిచ్చిన వైసీపీ నాయకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైసీపీ పట్టణ కన్వీనర్ వెంకటప్ప

కంబదూరు, మార్చి 4 ,ప్రభాతవార్త

అనంత జిల్లాలో పేదలకు సేవలందిస్తున్న ఆర్డిటీ సంస్థ ఎఫ్ సి ఆర్ ఎ రెన్యూవల్ కోసం కళ్యాణదుర్గం వైసిపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో తలపెడుతున్న లక్ష పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని వైసిపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కంబదూరు మండల కేంద్రంలో బుధవారం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దొడగట్ట నారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, కంబదూరు పట్టణ కన్వీనర్ వెంకటప్ప ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్డిటీ సంస్థ విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరి ప్రదర్శించడం సరైన పద్ధతి కాదన్నారు. వారం రోజుల్లో ఆర్డిటి సంస్థకు ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ ను పునరుద్ధరిస్తామని చెప్పిన కూటమి నాయకుల హామీ ఏమైందని వైసిపీ నాయకులు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి ఆర్డిటీ సంస్థ పై చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డీటీ ఎఫ్ సి ఆర్ రెన్యువల్ విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు చలనం తెచ్చేందుకు ఈనెల 10 తేదీన కుందుర్పి మండల కేంద్రంలోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆలయం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున లక్ష పోస్ట్ కార్డుల కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్టు వారు వెల్లడించారు. ప్రజల నుంచి సేకరించిన పోస్ట్ కార్డులను ప్రధానమంత్రి నరేంద్ర మోదికి పంపుతున్నట్లు తెలిపారు. కావున ఆర్టిటీ సంస్థ ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఆర్డిటీ ని కాపాడుకునేందుకు పోస్ట్ కార్డుల ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఆర్ సీపీ జిల్లా బూతు విభాగం కార్యదర్శి నీలి శంకరప్ప, జిల్లా డాక్టర్ల సంఘం అధ్యక్షుడు బొమ్మయ్య, జిల్లా రైతు విభాగం అండేపల్లి గాజులు రామాంజనేయులు, మండల ఎంపీపీ లక్ష్మీదేవమ్మ తనయుడు భీమేష్, వైస్ ఎంపీపీ సోమశేఖర్, మండల కో ఆప్షన్ నెంబర్ ఫయాజ్ ,తాలూకా మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదు,మండల ప్రధాన కార్యదర్శి మల్లూరు వెంకటేశులు, మండల బూత్ విభాగం కన్వీనర్ మీసేవ కుమార్, మండల ఎస్సీ సెల్ నాయకులు కొత్తపల్లి లింగమూర్తి,మండల బీసీ సెల్ అండేపల్లి రమేష్, పంచాయతీ ,టౌన్ అనుబంధ విభాగాల నాయకులు మల్లికార్జున, ఈడిగ పవన్, సిహెచ్ రామస్వామి, రాజు, క్రాంతి , ఈడిగ మారుతి,రవి, ఒంటారెడ్డిపల్లి వెంకటేశులు, ఒంటా రెడ్డిపల్లి హనుమంతు, బేల్దారి రామకృష్ణ ,రాళ్లపల్లి ముత్యాలు, బేల్దారి అనిల్, కొడతల ప్రసాద్, కావేటి రమేష్, వడ్డే ముత్యాలప్ప, ఒంటారెడ్డిపల్లి శ్రీనివాసులు, వడ్డే ప్రసాద్ అభిమానులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి స్వర్ణ గ్రామాల్లో అందుబాటులో ఎస్ఎస్‌సి హాల్ టికెట్లు

అమరాపురం మార్చి 4 ప్రభాతవార్త

మండలంలో సత్యసాయి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ ఎస్ సి విద్యార్థుల సౌకర్యం హాల్ టికెట్లను స్వర్ణ గ్రామాల్లో డౌన్లోడ్ చేసి ఇచ్చే కార్యక్రమాన్ని నేటి నుండి అందుబాటులోకి తీసుకొని రావాలని ఎంపీడీవో రామారావు ,మండల విద్యాశాఖ అధికారి పి. ఎన్. సత్యనారాయణలు తెలిపారు. మండలంలోని అన్ని స్వర్ణ గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్లు పదవ తరగతి విద్యార్థులకుహాల్ టికెట్లను డౌన్లోడ్ చేసి ఎలాంటి రుసుము తీసుకోకుండా ఉచితంగా తీసి ఇవ్వాలని వారు ఆదేశించారు. స్వర్ణ గ్రామంలో నోటీస్ బోర్డుపై ఉచితంగా అందించే ఎస్ ఎస్ సి హాల్ టికెట్ల సేవలను తప్పనిసరిగా ప్రదర్శించాలని కోరారు. గ్రామ కార్యదర్శులు ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిసే విధంగా చాటింపు లేదా ఇతర మార్గాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు స్వర్ణ గ్రామంలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఇసుక టిప్పర్లు సీజ్

బెలుగుప్ప, మార్చి 4 ప్రభాతవార్త



సీజ్ చేసిన ఇసుక టిప్పర్లు

బెలుగుప్ప మండల పరిధిలో హగరి నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ శివ సీజ్ చేసి గుమ్మగట్ట గ్రామానికి చెందిన ఇసుకను తరలిస్తున్న నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## మూగ జీవాల మేత.. కాలి పూడిద..

### - ఎంత ప్రయత్నించినా కాపాడలేక పోయానన్న రైతు



కోనాపురం గ్రామంలో రెండు గడ్డి వాములు దగ్ధం అవుతున్న దృశ్యం

బెలుగుప్ప, మార్చి 4 ప్రభాతవార్త

ఆరుగాలం పండించిన పంటలు లాభదాయకం కాకున్నా ఏదో మూగ జీవాలకు అయినా పంటలు ఉపయోగపడుతాయని పండిస్తున్న రైతన్నకు దేవుడు అక్కడ కూడా అన్యాయం చేస్తున్నాడు. మండల పరిధిలోని కోనాపురం గ్రామంలోని రైతువద్దే పెద్దన్న కణేకల్లు నుంచి గడ్డి మూడున్నర ట్రాక్టర్ల గడ్డి, అర్ధం ట్రాక్టర్ ఉలవపొట్టును తీసి జాగ్రత్తగా వామిగా వేసుకుని ఎండా కాలంలో మూగ జీవాలకు మేతగా వేసేందుకు సిద్ధం చేసుకున్నాడు. అయితే బుధవారం షార్ట్ సర్క్యూట్ అవడం మూలాగా గడ్డి వామికి నిప్పు చేరి మొత్తం దగ్ధం అయిందని రైతు వడ్డే పెద్దన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అయితే వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చినా అది శరా మామూలుగానే ఆలస్యంకావడంతో అంత వరకు రైతు ఇతరుల సమాయం తీసుకుని ఆర్పే ప్రయత్నం చేయగా ఫలితం లేకుండా పోయింది. 1.50 లక్షలు ఖర్చు పెట్టి మూగ జీవవాలకు మేత సిద్ధం చేస్తే చివరికి బూడిద మిగిలిందని రైతు చెందుతున్న ఆవేదనాన్ని ఇతరులకు కంట తడిపించింది. అధికారులు వెంటనే స్పందించి రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

## శ్రీసాయి యేసు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు సిబిఎస్ఈ గుర్తింపు



శ్రీసాయి యేసు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్

-చిలమత్తూరు, మార్చి 4 ప్రభాతవార్త

చిలమత్తూరు మండలంలోని శ్రీసాయి యేసు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నుంచి అఫిలియేషన్ లభించిందని సిబిఎస్ఈ గుర్తింపు పొందిందని పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు సిబిఎస్ఈ అఫిలియేషన్ నెంబర్ 130838ను కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఓంప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఇంతవరకు చిలమత్తూరు మండలంలో సిబిఎస్‌సి విద్యా వ్యవస్థ అందుబాటులోకి రాలేదని, అయితే ఇప్పుడు తమ పాఠశాల ఆధ్వర్యంలో సిబిఎస్‌సి ఏర్పాటు కాబోతుందన్నారు. సిబిఎస్ఈ ద్వారా గ్రామీణ విద్యార్థులకు పట్టణ ప్రాంత విద్యార్థులతో సమానంగా ఉత్తమ విద్యా బోధనకు అవకాశం వుంటుందని వారు పేర్కొన్నారు.

## పరీక్షలు జరుగుతున్నా మూతబడని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు..!

### -అమలుకు నోచుకోని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు

### -చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

ఉరవకొండ, మార్చి 4 ప్రభాతవార్త

పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలన్న జిల్లా కలెక్టర్ అదేశాలు ఉరవకొండలో అమలుకు నోచుకోవడం లేదు. స్థానిక ఇంటర్ పరీక్షా కేంద్రాలైన ఎస్.కె.ప్రభుత్వ జూనియర్, బాలికల జూనియర్ కళాశాలలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు కొన్ని యధేచ్ఛగా తెరిచి కార్యకలాపాలు చేసుకొంటున్నా సంబంధితశాఖ అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుంతకల్లు సహాయ కార్మిక అధికారి గతనెల 13వ తేదీన ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. మార్చి 2 నుండి 13వ తేదీవరకు, తిరిగి మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాన్నం 12.45 గంటల వరకు ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నందున ఆయా సమాయాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను తెరవరాదని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే కొందరు నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తుండగా మరికొందరు వాటి నిర్వాహకులు సెంటర్లను తెరిచి కార్యకలాపాలు కొనసాగిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అయినా నిబంధనలు అమలు చేయాల్సి అధికారులు ఆయా సెంటర్ల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం అటుంచితే కనీసం వారించే ప్రయత్నం కూడా చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారుల్లో చలనం వస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన తహాసిల్దార్, ఎస్సై



పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన దృశ్యం

అమరాపురం మార్చి 4 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని అమరాపురం తహసిల్దార్ లక్ష్మీనరసింహం, అమరాపురం ఎస్ఐ వలి భాష లు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్ష జరుగుతున్న గదులను పరిశీలించడంతోపాటు విద్యార్థులకు త్రాగునీరు మరియు ఇతర సౌకర్యాలపై డిపార్ట్మెంటల్ అధికారితోపాటు చీఫ్ లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం మరి ఇతర వివరాలను తెలుసుకొని పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఆర్డీటీకు ఎఫ్‌సీఆర్ఏను వెంటనే పునరుద్ధరించాలి

### -ప్రజాబలం సంఘం వ్యవస్థాపకులు ఆర్.రామప్పనాయక్

### -ఉరవకొండకు చేరిన రథయాత్ర, సంతకాల సేకరణ



సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రజాబలం సంఘం వ్యవస్థాపకులు ఆర్.రామప్పనాయక్

ఉరవకొండ, మార్చి 4 ప్రభాతవార్త

ఆర్డీటీకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను వెంటనే పునరుద్ధరించి సంస్థ సేవా కార్యక్రమాలు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజాబలం సంఘం వ్యవస్థాపకులు ఆర్.రామప్పనాయక్ కోరారు. ఆర్డీటీ స్వచ్ఛంధ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని కోరుతూ ప్రజాబలం సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన రథయాత్ర బుధవారం ఉరవకొండ చేరింది. ఈ సందర్బంగా స్థానిక క్లాక్‌టవర్ కూడలిలో ప్రజల నుండి సంతకాలు సేకరించారు. ఈ సందర్బంగా ఆర్.రామప్పనాయక్ మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ కొన్ని దశాబ్దాలకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు, బలహీనవర్గాలకు సేవ చేస్తోందన్నారు. ఉచిత విద్య, వైద్యం, క్రీడలు, రైతులు, మహిళలకు ప్రోత్సాహం అందిస్తూ వెలకట్టలేని సేవలందిస్తూ వస్తోందన్నారు. అలాంటి సంస్థ విదేశీ విరాళాలు సేకరించడానికి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించకుండా కేంద్రం ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. రథయాత్ర అనంతరం ఆర్డీటీ సంస్థ ద్వారా లబ్ధిపొందిన ప్రజలతో ఈనెల 9వ తేదీన అనంతపురం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ బంధం రమేష్, జిల్లా మహిళా కన్వీనర్ మైమూన, ఉరవకొండ నియోజకవర్గ కన్వీనర్ అనీఫ్, వివిధ సంఘాల నాయకులు పాల్తూరు ఆనందరాజ్, మీనుగ గోపాల్, సాకే పురుషోత్తం, మధుకర్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## జెసిఆర్ డిఎస్ ఆధ్వర్యంలో శాంతినికేతన్ లో ఔషధ,సుగంధ మొక్కలు పై అవగాహన

పెనుకొండ మార్చి 4 ప్రభాతవార్త



ఔషధ సుగంధ మొక్కల సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఔషధ మరియు సుగంధ మొక్కల బోర్డ్ వారి ఆదేశాలతో జనచైతన్య రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఔషధ,సుగంధ మొక్కలు సాగు,పర్యావరణ పరిరక్షణ పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి,హెడ్మాస్టర్ అరుణలు మాట్లాడుతూ ఔషధ సుగంధ మొక్కలు పెంపకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపి వాటి ప్రయోజనాల గురించి తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు అడవుల పెంపకం,చెట్లు పెంపకం విరివిగా చేపట్టాలని ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద చెట్లు పెంచాలని,అదేవిధంగా వివిధ ఔషధ,సుగంధ మొక్కలను పెంచుకోవాలని తెలిపారు. నేటి సమాజంలో ఆకతాయిలు అడవులకు నిప్పు పెట్టడం వల్ల అడవులలో ఉన్న చెట్లు, వన్యప్రాణులు అంతరించిపోతున్నాయని వాటన్నిటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. విద్యార్థులు మీ తల్లిదండ్రులు కుటుంబ సభ్యులకు అడవుల ప్రాముఖ్యత గురించి తెలపాలన్నారు. జన చైతన్య రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు చంద్రమోళి మాట్లాడుతూ పెరిగిపోతున్న జనాభాతో వాహనాలతో వాతావరణం కాలుష్యం అవుతుందని, విరివిగా రసాయనాలు వాడడం వల్ల గాలి,నీరు కలుషితమవుతుందని వీటన్నిటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని , వీటన్నిటిని ఎలా కాపాడుకోవాలనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ నిషేధం ఆవశ్యకత, ఫ్యాక్టరీల నుంచి వచ్చే విష వాయువుల నివారణ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు చంద్రమోళి, శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి,హెడ్మాస్టర్ అరుణ, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సవితమ్మ రాకతోనే..బూచేపల్లి రోడ్డుకు మహర్దశ వచ్చింది

### నాణ్యతతో కూడిన పనులు వేగంగా జరగాలి

### అధికారులతో కన్వీనర్ బాలకృష్ణ చౌదరి



పనులను పరివేక్షిస్తున్న బృందం.

గోరంట్ల మార్చి 4 ప్రభాతవార్త

మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు బూచేపల్లి కొత్తపల్లి బిటి రోడ్డు నిర్మాణ పనులను గుత్తా బాలకృష్ణ చౌదరి టీడీపీ మండల కన్వీనర్, పంచాయతీ రాజ్ డి ఈ వెంకటరమణ,టీడీపీ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, కాంట్రాక్టర్ ధనంజయ నాయుడు, బూచేపల్లి శివ, మురళి మోహన్, రోహిత్, సుభాహన్, భరత్ కుమార్, మురళి, శ్రీశైలం శ్రీనివాసులు పాల్గొన్నారు.

## తాగునీటి పైప్‌లైన్ ధ్వంసం

రామగిరి, మార్చి 4 ప్రభాతవార్త



తాగునీటి పైప్‌లైన్ ధ్వంసం చేసిన దుండగులు

మండలంలోని కానుగులకుంట గ్రామంలో తాగునీటి పైప్‌లైన్‌ను గుర్తు తెలియని దుండగులు బుధవారం ధ్వంసం చేశారు. వివరాల మేరకు.. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో పైప్‌లైన్ ఉండటంతో అది కూడా అక్కడక్కడ పైప్ మట్టి లేకుండా ఉండటంతో కొందరు ఉద్దేశ్యపూర్వకంగా పైపును ధ్వంసం చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనపై సంబంధిత అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో వెంటనే పంచాయితీ సెక్రెటరీ పైప్‌లైన్ మరమ్మత్తులు చేయించేలా చర్యలుచేపట్టారు. గ్రామంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జర్నలిస్టులకు అన్ని విధాల అండగా ఉంటా

- ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్



జర్నలిస్టులకు హెల్మెట్‌లను పంపిణీ చేస్తున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్

**అనంతపురం కల్చరల్, మార్చి 4 ప్రభాతవార్త**

వర్కింగ్ జర్నలిస్టులందరూ ప్రాణం విలువ తెలుసుకొని విధుల నిమిత్తం బయటకు వెళ్ళే ప్రతి జర్నలిస్టు హెల్మెట్ తప్పక ధరించాలని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ సూచించారు. మీనాక్షమ్మ పౌండేషన్ చైర్మన్ కొప్పుల వెంకట రమణ సహకారంతో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఏపీ జర్నలిస్టు డెవలప్మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలో ఉన్న జర్నలిస్టులకు ఉచితంగా హెల్మెట్ల ను పంపిణీ చేశారు. అనంతపురం నగరం లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచో ఫెర్రర్ మాట్లాడుతూ.. ప్రతి జర్నలిస్టు హెల్మెట్ ధరిస్తే అకస్మాత్తుగా జరిగే ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని వారే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలో రవి కాంత్ రమణా సేవలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయని, అభినందనీయమని ఆయన అన్నారు. మీనాక్షమ్మ పౌండేషన్ చైర్మన్ కొప్పుల వెంకట రమణ మాట్లాడుతూ తన ట్రస్టు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి జర్నలిస్టు హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల నుంచి ప్రాణాలను దక్కించుకుని కుటుం బానికి అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చ రామలింగా రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి డి.రాజగోపాల్, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా నాయకులు వెంకటేష్, షాకీర్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూని యన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగ రెడ్డి మాట్లాడుతూ.. జర్న లిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయిం చడంతో పాటు అవసరం అయిన వారికి శస్త్ర చికిత్సలు చేయించాలని కోరగా అందుకు వెంకట రమణ సమ్మతించారు. ఇల్లు లేని ప్రతి జర్నలిస్టు కూడా ఇల్లు నిర్మించే బాధ్యత తీసుకుంటామని మచ్చా రామలింగారెడ్డి హామీ ఇచ్చారు.

## విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ పై శిక్ష

**అనంతపురం క్రైమ్ మార్చి 4, ప్రభాతవార్త**



విద్యార్థులకు స్వీయ సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల సందర్భంగా బుధవారం అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, మోడల్ పాఠశాలల్లో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ ట్రెనింగ్ కా ర్య క్ర మా లు నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో మహిళల భద్రత, ఆత్మవిశ్వాసం, స్వీయ రక్షణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని పోలీసు అధికారులు తెలిపారు. చిన్న వయసు నుంచే బాలికలకు ఆత్మరక్షణ నైపుణ్యాలు నేర్పడం ద్వారా వారు భవిష్యత్తులో ధైర్యంగా ముందుకు సాగేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. ప్రాథమిక కరాటే, తైక్వాండో పద్ధతులపై శిక్షణ, అపరిచితుల నుంచి రక్షణ పొందే చిట్కాలు, అత్యవసర సమయంలో ఎలా స్పందించాలి అనే ప్రాక్టికల్ డెమోస్, మహిళా హెల్ప్‌లైన్ నంబర్లు, చట్టపరమైన హక్కులపై అవగాహన, మానసిక ధైర్యం, శారీరక ఫిట్‌నెస్‌పై మార్గదర్శకాలు ఈ కార్యక్రమాల్లో మహిళా పోలీస్ సిబ్బంది, క్రీడా శిక్షకులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొని విద్యార్థినులకు ప్రత్యక్ష ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని శిక్షణను ఆసక్తిగా స్వీకరించారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ బాలికలు తమ భద్రత విషయంలో అవగాహన కలిగి ఉండటం సమాజానికి అత్యంత అవసరమన్నారు. పాఠశాల స్థాయిలోనే ఆత్మరక్షణ శిక్షణ ఇవ్వడం వల్ల వారు మరింత ధైర్యంగా ఎదుగుతారని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పు తీసుకువస్తాయని పేర్కొన్నారు.

## పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ



పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**శింగనమల, మార్చి 4 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో బుధవారం రీ సర్వే జరిగిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ తాతయ్య, నరసింహులు, నిరంజన్‌రెడ్డి టిడిపి నాయకులు చిన్న జలాలపురం సుధాకర్, కోయగూర పెద్దన్న, అట్టె ధన, లక్ష్మీదేవి, సన్నలింగప్ప, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చక్కెర, టెంకాయలు రూ.5,55,000 లకు వేలం

**నార్పల, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

నార్పల మండలం గూగూడు గ్రామంలో బుధవారం శ్రీ కుళ్లాయిస్వామి దేవాలయంలో జరిగిన చక్కెర టెంకాయలు అమ్ముకొను హక్కునకు బహిరంగ వేలం వేయగా ఎం .రాజశేఖర్ రూ : 5,55,000 లకు పాట పాడుకున్నారు. సంబంధిత సప్లయర్స్ వేలం పాట వాయిదా వేసినట్లు కార్య నిర్వహణాధికారి సాకేతపురం శోభా తెలిపారు. సప్లయర్ వేలం తేదిని ఈనెల 12 కూ వాయిదా వేశమన్నారు.మని ఆలయ కార్యనిర్వాహనాధికారి తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఒన్నూరుస్వామి, గ్రామస్తులు రాజన్న, నరసింహులు, జాఫర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

**నార్పల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో బుధవారం రెవెన్యూ అధికారులు పట్టాదారు పసుపుస్తకాలు పంపిణీ చేసారు. గతంలో బండ్లపల్లిలో రీసర్వే కార్యక్రమం జరిగింది. సందర్భంగా 714 మంది రైతులకు పెట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో రిసర్వే డీటీ నిరోషా, సర్వేయర్ అనిల్, వీఆరోఓ దాదాఫిరా, విరోఓ లు, వీఏస్ ఏ లు సర్పంచ్ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్.జగన్‌ను కలిసిన సత్రసాల మంజునాథ్

**అనంతపురం సిటీ, మార్చి 4 ప్రభాతవార్త**



వైఎస్.జగన్‌తో సత్రసాల మంజునాథ్

మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్. జగన్ మోహన్‌రెడ్డిని ఆర్యవైశ్య సంఘం నేత సత్రసాల మంజునాథ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నివాసంలో వైసిపి వాణిజ్య విభాగం అనంతపురం నియోజకవర్గ అద్యక్షులు సత్రసాల మంజునాథ్ కలిశారు. ఈ సందర్భంగా పార్టీలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పిస్తుండటం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం వాణిజ్య విభాగం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను వ్యాపార వర్గాల్లోకి తీసుకెళ్లాలని పార్టీ అధినేత సూచించారన్నారు. పలు అంశాలపై ఆయన పార్టీ అధ్యక్షునితో చర్చించినట్లు తెలిపారు.

## ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తీవ్ర పరిణామాలు

*మొదటిపేజీ తరువాయి...*

అంగన్వాడీలు కోరితే వారిపై కూటమి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించిందని, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల అరెస్టుపై వైఎస్ఆర్ సిపి ఖండిస్తోందని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు.

**ప్రజా ప్రతినిధులకు కమీషన్లు ఇవ్వలేక పారిపోతున్న పారిశ్రామిక వేత్తలు :**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా ప్రతినిధులు దోచుకో..దాచుకో.. అన్న రీతిలో వ్యవహరిస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. పారిశ్రామిక ప్రగతి అంటూనే పారిశ్రామిక వేత్తలు పారిపోయే రీతిలో రాష్ట్రంలో నెలకొందన్నారు. అనంతపురం జిల్లా తిమ్మసముద్రంలో పరిశ్రమలు స్థాపించడానికి 121 ఎకరాలను జిన్‌ప్రా కంపెనీకి కేటాయించారని, శ్రీ సత్యసాయి జిల్లా గుడిపల్లి వద్ద ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్‌కు 70 ఎకరాలు కేటాయించారని కానీ వారు తమకు కేటాయించిన భూములను వద్దనుకుని వెళ్లిపోతున్నారని ఆయన ఆరోపించారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను సైతం వద్దనుకుని వెళ్లిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజాప్రతినిధులు 20 నెలలుగా దోచుకోవడమే పనిగాపెట్టుకున్నారని హామీలు నెరవేర్చే విషయంలో ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు.

**అమరావతి రాజధానికి మేం వ్యతిరేకం కాదు :**

రాజధాని అమరావతికి మేం వ్యతిరేకం కాదని నిర్మాణాలను అనువుగాని ప్రదేశాలలోనే కట్టడం చేయడం తప్పు అని అమరావతిని సీఎం చంద్రబాబు రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మార్చేశారని అనంత వెంకటరామిరెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. 2014 నుంచి 2019 వరకు రాజధానిపేరుతో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, రాజధాని ఎక్కడ వస్తుందో ముందే లీకు ఇచ్చి తమకు కావాల్సిన వారు భూములు కొనుక్కునేలా చంద్రబాబు చేశారని ఆయన ఆరోపించారు. తొలి దశలో సేకరించిన 53వేల ఎకరాల్లో ఎలాంటి అభివృద్ధి చేయకుండా మళ్లీ భూసేకరణ అంటున్నారు. ఈ 21 నెలల్లో ఏకంగా 47 వేలకోట్ల రూపాయలు అమరావతి పేరిట అప్పులు చేశారని ఆయన విమర్శించారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదని రియల్ ఎస్టేట్ కంపెనీ అని దీనికి చంద్రబాబు సీఈఓ అని ఆయన వ్యాఖ్యానించారు. 53వేల ఎకరాల్లో అభివృద్ధికి లక్ష కోట్లు అవసరం అయితే 1.75 లక్షల ఎకరాల్లో అభివృద్ధి ఎంత నిధులు కావాలని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాలను కోసం చేసిందని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, పప్పువనగ, మొక్కజొన్న రైతులు మద్దతు ధరలు లేక అవస్థలు పడుతున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని ఆయన విమర్శించారు. పోలీస్‌శాఖలో కొందరు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారు తప్పకుండా చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. అంగన్వాడీలు తమ సమస్యల కోసం ఆందోళనలు చేస్తే పోలీసులు లాఠీ చార్జీలు చేశారని, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణికికూడా గాయాలయ్యాయని కొందరు మగ పోలీసులు అంగన్వాడీ కార్యకర్తల పట్ల అనుచితంగా వ్యవహరించారని ఇది ముమ్మాటికి తప్పని ఆయన హెచ్చరించారు.

## బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన పోతన్న



కామ్రేడ్ పోతన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**శింగనమల, మార్చి 4 ప్రభాతవార్త**

బడుగు బలహీన వర్గాల కోసం కామ్రేడ్ కొండపల్లి పోతన్న పోరాడాడని సిపిఐ జిల్లా కార్యవర్గ వర్గ సభ్యులు డి.చిన్నప్ప యాదవ్ పేర్కొన్నారు. బుధవారం కామ్రేడ్ కొండపల్లి పోతన్న 6వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని చిన్న జిలాలపురంలోని ఆయన స్థూపం వద్ద సిపిఐ పార్టీ వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ.. కామ్రేడ్ పోతన్నమరణించి ఆరు సంవత్సరాలైనా ఆయన పేద బడుగు బలహీన వర్గాల కోసం పని చేసిన పనులు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని, అటువంటి వ్యక్తి మరణించడం ఉద్యమాలకు తీరని లోటు అని ఆయన అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పేదలకు అందాల్సిన ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, వైద్య సదుపాయం, దున్నేవాడిదే భూమి అన్న నినాదంతో ముందుకు తీసుకుని బడుగు బలహీన వర్గాల కోసం ముందుకెళ్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నాగమునెమ్మ, చంద్రశేఖర్, రాము, సిపిఐ మండల సహాయ కార్యదర్శి చేనేత మధు, చికెన్‌బాషా, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, ఆదినారాయణ, వెంకటేష్‌రెడ్డి, నల్లప్ప, మునిస్వామి, రూప్లానాయక్, జయరామ్‌నాయక్, కృష్ణ నాయక్, ప్రభాకర్, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో రైతు మృతి

**ఓబులదేవరచెరువు, మార్చి 4, ప్రభాతవార్త**

మండలంలోని నవాబు కోట గ్రామ సమీపంలో అడవి పందుల భారి నుండి పంటను రక్షించుకునేందుకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి బుధవారం ఉదయం రమణ (39 ) అనే మృతి చెందినట్లు ఎస్సై బి. మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. ఎస్సై, స్థానికులు తెలిపిన వివరాలు మేరకు నవాబు కోట గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ , తాను సాగుచేసిన వేరుశనగ పంటపై నిత్యం అడవిపందులు దాడి చేస్తున్నడంతో పొలం చుట్టూ విద్యుత్ తీగలను అమర్చాడన్నారు. అతని పొలం పక్కనే మరో రైతు రమణ పొలం కూడా ఉంది. అతని పొలంలో కూడా కొంతమేర విద్యుత్ తీగలు వదిలాడన్నారు. రోజువారి పనుల్లో భాగంగా పొలంలోకి వెళ్లిన రమణ విద్యుత్ తీగలను గమనించలేదన్నారు. దీంతో విద్యుత్ తీగలను తాకడంతో రమణ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుని భార్య శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేష్ పై కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



మృతి చెందిన రైతు రమణ

## మండల అభివృద్ధి ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండడమే ప్రధాన లక్ష్యం

- ఎంపీడీవో పార్థసారథి

**నంబులపూలకుంట, మార్చి 3 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న ఎంపిడిఓ పార్థసారథి

వేసవిలో నీటి కొరత రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు. మండల కేంద్రం పరిధి వేసవిలో నీటి సమస్యలు రాకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు తెలపడం జరిగింది. ఉపాధి హామీ మాస్టర్ల మాయజాలం నివారించడానికి ఎలాంటి చర్యలు ఉంటాయి. జవాబు ఉపాధి పనులు జరిగిన ప్రదేశం కచ్చితంగా పరిశీలించి ఆ ప్రదేశంలో ఉపాధి కూలీల సంఖ్య మాస్టర్ పేర్లు వారి యొక్క సంతకాలు పరిశీలించి తేడా ఉంటే తప్పకుండా సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయి. మండల కేంద్రంలో నివాసమంటూ విధి నిర్వహణ నిర్వహించడం వలన మీ అభిప్రాయం ఏమిటి జవాబు మండల కేంద్రంలోని నివాసం ఉంటే ప్రజాలకు ప్రతినిధులు అందరికీ అందుబాటులో ఉండి మండల అభివృద్ధి చేయడంలో అంతేగాకుండా ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క పథకాలను అందరికీ తెలపడం అలాగే అధికారులకి మండల ప్రజలు చూపుతున్న అభిమానం నాకు ఎంతో సంతోషంగా ఉన్నదని తెలపడం జరిగింది.

## స్వీపర్స్, హెల్పర్స్‌కు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- సిఐటియు నాయకులు



విద్యాశాఖకార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

**కదిరి, మార్చి 4 ప్రభాతవార్త**

పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్వీపర్స్, హెల్పర్స్‌కు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎమ్మార్సి కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని 13 ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే 10 మంది హెల్పర్స్‌కు ఎటువంటి కారణం లేకుండా తొలగించడం అన్యాయం అన్నారు. స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్న 13 మందికి 2024 ఫిబ్రవరి నుంచి 2025 ఫిబ్రవరి వరకు 12నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ, నాగభూషణమ్మ, సాజీదా, అరుణ, నీలావతి, గంగులమ్మ, చంద్రకళ, సాహిస్తాలు పాల్గొన్నారు.

## అధికారుల సలహాల మేరకే రసాయనాలు వాడాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణ సంస్థ అధికారులు

**కదిరి, మార్చి 4 ప్రభాతవార్త**

అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని వారి సిఫార్సు మేరకు రసాయన ఎరువులు, పురుగుల మందులను తగిన మోతాదులోవాడాలని ఏపిఎస్ఓ పిసిఏ జిల్లా అధికారి బి.వెంకటేష్ సూచించారు. బుధవారం ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులు ఆంధ్రప్రదేశ్ సేంద్రీయ ఉత్పత్తుల (ధృవీకరణ) సంస్థలో నమోదు చేసుకోబడిన కదిరి మండలంలోని రైతులపొలాలను బి.వెంకటేష్, స్థానిక వ్యవసాయ అధికారి శ్రీహరినాయక్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగుల మందులు అధిక మోతాదులో వాడితేపంట ఉత్పత్తుల్లో పురుగు మందుల అవశేషాల కారణంగా మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. అనంతరం సేంద్రీయ ఉత్పత్తుల ప్రాముఖ్యతను వివరించారు. ధృవీకరణ పొందిన పంట ఉత్పత్తులు అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రశాంతి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రెడ్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ



రైతులకు పట్టాదారుపాసుపుస్తకాలు అందచేస్తున్న దృశ్యంన

**పుట్లూరు, మార్చి 4 ప్రభాతవార్త**

మండలంలోని చింతకుంట గ్రామంలో రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను బుధవారం గ్రామ సర్పంచు శివరామయ్య ఆధ్వర్యంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మన పట్టా భూములు రీ సర్వే చేసి జగన్ ఫోటోలను ముద్రించి పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందజేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటి స్థానంలో రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయడం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ నరసింహులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం

**యాడికి, మార్చి 4 ప్రభాతవార్త**

మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలోని లీలావతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం కొత్తూరు రాజ్‌కుమార్ అన్నదానం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. ప్రతి ఏడాది తమ సంఘం తరఫున వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించనున్నట్లు రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, లాలప్ప, వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

## శఠగోపం దొంగతనాన్ని ఛేదించిన పోలీసులు



శఠగోపం దొంగలించిన నిందితులతో సిఐ పుల్లయ్య బృందం

**బుక్కరాయసముద్రం మార్చి 4 ప్రభాతవార్త**

బుక్కరాయసముద్రం పరిదిలోని చెరువుకట్ట పై వెలసి శ్రీ షిరిడిసాయిబాబా దేవాలయంలో గత నెల ఫిబ్రవరి 25న దేవున్ని శఠగోపం దొంగలించిన విషయం తెలిసిందే ఆలయ పూజారి ఫిర్యాదుమేరకు సిఐ పుల్లయ్య కేసునమోదుచేసుకొని ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టారు.బుదవారం పోలీసుస్టేషల్లో సిఐ పుల్లయ్య విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగ ఆయన మాట్లడుతూ ఆలయం పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి నిందుతులను గునర్తించడం జరిగింది.ముసలమ్మకట్ట సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహంవద్ద అనుమానాస్పదంగా ఎపి9 యుజెడ్ 5607 నంబర్‌గల ఆటోలో వెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా శఠగోపాన్ని దొంగలించినట్లు ఒప్పుకున్నారు.నిందితులు అనంతపురం సాయినగర్‌కు చెందిన కుంతూరు మహేశ్వర్‌రెడ్డి,సెకండ్ రోడ్డుకు చెందిన బళ్ళారి ఎస్ బాషాగా గుర్తించి వారి వద్ద నుంచి శఠగోపాన్ని స్వాదీనం చేసుకున్నాం.దొంగలించిన శఠగోపం విలువ సుమారు రూ,లక్ష వరకు ఉంటుందన్నారు.కేసు నమోదుచేసుకొని నిందుతులను రిమాండ్‌కు తరలించామన్నారు.ఈ దర్యాప్తును ఛేదించిన ఎస్ఐ రామ్‌ప్రసాద్, కానిస్టేబుల్ వారాధి,శ్రీకాంత్,వలి, సిబ్బందిని సిఐ పుల్లయ్య అభినందించారు.

## స్వీయ రక్షణపై విద్యార్థినిలకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ

**తాడిపత్రిఅర్బన్, మార్చి 4 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని చర్చి స్కూల్ విద్యార్థినిలకు రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తైక్వాండో ద్వారా స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల సందర్భంగా పాఠశాలలో బుధవారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థినిలకు స్వీయ రక్షణ, శిక్షణ కార్యక్రమంపై సాయి తైక్వాండో కోచ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాయి తైక్వాండో కోచ్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఘనంగా లీలావతి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

**పుట్లూరు, మార్చి 4 ప్రభాతవార్త**

పుట్లూరు మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాతృమూర్తి, టిడిపి సీనియర్ నాయకురాలు బండారు లీలావతి జన్మదిన వేడుకలను మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హాజరైన వారికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు మండల సింగిల్ విండో అధ్యక్షులు గోవర్ధన్‌రాజు, నాయకులు చెన్నారెడ్డి, కులశేఖర్‌రెడ్డి, సత్యంరెడ్డి, బ్రహ్మయ్య, సుదర్శన్‌నాయుడు, రవికుమార్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఓబుళనాయుడు, రామచంద్రారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వ్యక్తి మృతి

**తాడిపత్రిఅర్బన్, మార్చి 4 ప్రభాతవార్త**



పెన్నానదిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నా నదిలో బుధవారం హుస్సేన్ (50) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు రూరల్ సిఐ శివ గంగా ధర్ రెడ్డి తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన హుస్సేన్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవన సాగించేవాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసై పనులు చేయకుండా నిత్యం మద్యంలోని ఉండేవాడన్నారు. బుధవారం ఉదయం పెన్నానదిలో ఒక వ్యక్తి మృతి చెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి సిఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐలు ధరణిబాబు, కాటమయ్య, సిబ్బంది కలిసి మృతదేహాన్ని పరిశీలించి విచారించగా గాంధీనగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి వివరాలు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మహబూబ్‌బాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి అరెస్ట్

**తాడిపత్రిఅర్బన్, మార్చి 4 ప్రభాతవార్త**

చిత్తూరు జిల్లా వీకోటకు చెందిన రాజశేఖర్ అనే వ్యక్తిని పట్టణ ఎస్ఐ గౌస్‌బాష అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. పట్టణంలోని యల్లనూరు రోడ్డు శివానగర్ చెందిన ప్రభ అని యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో చిత్తూరు జిల్లా వీకోటకు చెందిన రాజశేఖర్‌కు పరిచయమైంది. రాజశేఖర్ బెంగళూరులో సెల్ కంపెనీలో పని చేసుకుంటూ జీవన సాగించేవాడు. గత కొంతకాలంగా ఇన్‌స్టాగ్రామ్‌లో తాడిపత్రి చెందిన ప్రభ అనే అమ్మాయితో పరిచయం అయి పెళ్లి చేసుకుంటానని నమ్మించి పెళ్లి చేసుకోకపోవడంతో ఆమె మనస్థాపానికి గురై రెండు నెలల క్రితం ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు కారణం రాజశేఖర్ అని అప్పట్లో ప్రభ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి బుధవారం రాజశేఖర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు.

## ఆకట్టుకున్న బ్లెండర్స్ ప్రైడ్ డ్రింకింగ్ వాటర్ క్యాంపెయిన్

**అనంతపురం కల్చరల్, మార్చి 4 ప్రభాతవార్త**

బ్లెండర్స్ ప్రైడ్ ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ ద వన్ అండ్ ఓన్లీ కొత్త క్యాంపెయిన్ ఆకట్టుకుంది. పెర్నాడ్ రికార్డ్ ఇండియా ఛీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ దేబాశ్రీ దాస్ గుప్తా మాట్లాడుతూ..ఐసీసీ టీ-20 ప్రపంచ కప్పు, ప్రధాన నగరాల్లో ప్రభావితపరిచే అవుట్ డోర్ సైట్స్ సహా డిజిటల్, సోషల్ ప్లాట్ ఫాంలలో 360 డిగ్రీల సమీకృత క్యాంపెయిన్ ప్రారంభించబడిందని తెలిపారు. బ్రాండ్ సాంస్కృతిక నాయకత్వం విస్తృతంగా కనిపించడాన్ని ప్రోత్సహిస్తూ.. శక్తివంతం చేస్తోందన్నారు.

# స్థానిక సమస్యలను నియోజకవర్గ సమస్యలుగా వక్రీకరించ వద్దు

## - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, మార్చి 4 ప్రభాతవార్త**

మండల పరిధిలోని నాగలగుడ్డం తాండా గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న కొన్ని సంఘటనలను కొంత మంది అనవసరంగా నియోజకవర్గ స్థాయి గ్రూపు రాజకీయాలుగా చిత్రీకరించడం దురదృష్టకరమని, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. బుధవారం ఆమె ఏడిసిసి బ్యాంకుచైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకుడు ఆలం నరసనాయుడుతో కలిసి పత్రికా సమావేశంలో మాట్లాడుతూ.. చాలా సంవత్సరాలుగా కొనసాగుతున్న గ్రామస్థాయి, స్థానిక విబేదాలు మాత్రమేనని ఈ స్థానిక సమస్యల కారణంగా గ్రామంలో అభివృద్ది పనులు దాదాపు ఒక సంవత్సరం పాటు నిలిచిపోయాయన్నారు. ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే అభివృద్ధిపనులు ఇకపై ఆగకూడదని, సంబంధత అధికారులకు, శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తన ఆదేశాల మేరకే పోలీసు శాఖ, సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేస్తూ గ్రామంలో నిలిచిన అభివృద్ది పనులను మళ్లీ ప్రారంభించి నిరంతరంగా కొనసాగిస్తున్నారన్నారు. గ్రామస్తుల ప్రయోజనాలే మా ప్రధాన లక్ష్యమనికొన్ని వార్తా ఛానళ్లు సరైన సమాచారం లేకుండా వాస్తవాలను ధృవీకరించకుండా ఈ సమస్యను నియోజక్వర్గ స్థాయి గ్రూపుసమస్యగా ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవం అన్నారు. అసలు సమస్య ఆ గ్రామంలోనే ఉందని, అక్కడ ఉన్న స్థానిక మహిళలు తనతో మాట్లాడుతూ.. మా గ్రామ ప్రజల్లో ఐక్యత లేదని జనవరి 31వ తేది పెన్షన్ పంపిణీకి వెళ్లినప్పుడు స్వయంగా తనకు మా పార్టీ జిల్లా అధ్యక్షులు పూలనాగరాజు, జిల్లాప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి దృష్టికి తీసుకొచ్చారన్నారు. తమరే చొరవ తీసుకుని అభివృద్ది పనులు నిలపకుండా చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామస్థాయిలో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న సమస్యలకురాజకీయ రంగు పులమడం పద్దతి కాదని ప్రజల్లో గందరగోళం సృష్టించేది మానుకోవాలన్నారు. మా శింగనమల నియోజకవర్గంలో ఎటువంటి గ్రూపురాజకీయాలు లేవని, అందరూ కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

# 80 వద్దు 40 అడుగుల ముద్దు

## రోడ్డు విస్తరణ పై ప్రజల అభ్యంతరం



వివరిస్తున్న కమిషనర్ మల్లికార్జున, చైర్మన్ రమేష్



అభ్యంతరాలు చెబుతున్న డిసి రఘునాథ్

**హిందూపురం మార్చి 4 ప్రభాతవార్త**

పట్టణంలోని తెలుగు తల్లి మేళాపురం సర్కిల్ నుంచి ముదిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి మీదుగా శిర జాతీయ రహదారి ని కలుపుతూ 4.5 కిలోమీటర్ల మేర 80 అడుగులు రోడ్డు విస్తరణ చేయాలని మున్సిపాలిటీ నిర్ణయించడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాయంకాలం ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు చేశారు. చైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ హిందూపురాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే బాలకృష్ణ నిధులు తెస్తున్నారని, మీ భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని 80 అడుగుల రోడ్డు కు మీరంతా సహకరించాలని అక్కడికి వచ్చిన వారిని కోరారు. అయితే మాస్టర్ ప్లాన్ ప్రకారం 40 అడుగులు మాత్రమే వెడల్పు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. అంతకుమించి విస్తరిస్తే తమ ఇండ్లు పోతాయని రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. బలవంతంగా రోడ్డు వెడల్పు చేస్తామని చెబితే ఆత్మహత్యలు తమకు శరణ్యమన్నారు. నేషనల్ హైవేకు కనెక్టివిటీ కావాలి అంటే దండు రోడ్డు విశాలంగా ఉన్నందున అక్కడ 100 అడుగులు చేయవచ్చుని చెప్పారు. నివాసాల మధ్య 80 అడుగులు చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. అందరి అభిప్రాయాలను ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి, మున్సిపల్ కౌన్సిల్ తో చర్చించి నిర్ణయం తీసుకోబడుతుందని కమిషనర్ హామీ ఇచ్చారు. సమావేశంలో ముద్దిరెడ్డిపల్లి కు చెందిన డిసి రఘునాథ్, మేళాపురం వాసులు ప్రభాకర్, నారాయణస్వామి, సింగిరెడ్డిపల్లి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు మాట్లాడారు.

# జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026 పోస్టర్‌ల ఆవిష్కరణ




పోస్టల్ ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

**అనంతపురం కలెక్టరేట్ మార్చి 05 ప్రభాతవార్త**

అనంతపురం కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో బుధవారం రాఘవేంద్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్అండ్‌రీసెర్చ్ ఎన్.ఎస్.ఎస్ విభాగం, మైభారత్ ,జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్2026 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. యువతలో నాయకత్వ లక్షణాలను, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీలను రైపర్ కళాశాల వేదికగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే మై భారత్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్న విద్యార్థులు అందరూ మార్చి 5వ తేదీన ఉదయం నిర్ణీత సమయానికి కళాశాలలోని పోటీ వేదికకు చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం డిడిఓ శ్రీనివాస్, రైపర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.పద్మనాభ రెడ్డి, రైపర్ వైస్ ప్రిన్సిపాల్ డా. జె.రవీంద్ర రెడ్డి, జేఎన్టీయూఏ ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.మమత, మై భారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ బిసతి భరత్, మై భారత్ అకౌంట్స్ అండ్ ప్రోగ్రామ్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాసులు, రైపర్ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.నాగశుభ మరియు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి -కమిషనర్ జస్వంత రావు




అన్నా క్యాంటీన్‌లో అల్పాహారం నాణ్యతపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

**అనంతపురం మార్చి04 ప్రభాతవార్త**

నగరంలో పారిశుధ్య నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించి పరిశుభ్రంగా వుండేలా చూడాలని సంబంధిత పారిశుధ్య పర్యవేక్షణాధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆదేశించారు. సాధారణ పర్యవేక్షణలో భాగంగా బుధవారం నగరంలోని సుభాష్‌రోడ్డు, రాజు రోడ్డు, ఆర్టీసి బస్టాండు, గుత్తి రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అలాగే సైఫుల్లా బ్రిడ్జి, రామచంద్రానగర్, తపోవనం నుంచి బళ్లారి బైపాస్ వరకువున్న సర్వీసురోడ్లకు ఇరువైపుల వున చెత్తకుప్పలను, పిచ్చి మొక్కలను తొలగించాలని శానిటరీ ఎన్‌స్పెక్టర్‌కు సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా వుండాలన్నారు. అనంతరం బళ్లారి రోడ్డులో వున్న అన్నా క్యాంటీన్‌ను పరిసర ప్రాంతాన్ని పరిశీలించి పరిశుభ్రంగా వుంచాలని, ఆహారనాణ్యతప్రమాణాలను పరిశీలించారు.

# సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

## జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**శ్రీ సత్యసాయి జిల్లా, మార్చి 04, ప్రభాతవార్త ప్రతినిధి**

శ్రీ సత్యసాయి జిల్లాను ఆధ్యాత్మికంగా, పర్యాటక రంగంలో ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జాయింట్ కలెక్టర్ మౌర్య భారద్వాజ్ తో కలిసి, విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్ పి ఎ) నిపుణులతో కలిసి జిల్లా అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో విజయవాడ ఎస్ పి ఎ ప్రతినిధులు ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ కుమార్ చిలకపాటి, డాక్టర్ అర్పన్ పాల్ సింగ్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను వివరించారు. పుట్టపర్తి పరిసర ప్రాంతాలను పర్యావరణఆధ్యాత్మిక హబ్‌గా



హాజరైన సంబంధిత శాఖల అధికారులు

తీర్చిదిద్దడం. బుక్కపట్నం చెరువులో శ్రీ సత్యసాయి బాబా భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, పుట్టపర్తికి ఔటర్ రింగ్ రోడ్లు, గ్రోత్ కారిడార్ల నిర్మాణంపై సాధ్యాసాధ్యాల అధ్యయనం, అడ్వెంచర్ టూరిజం అభివృద్ధి, గిన్నిస్ బుక్ రికార్డు పొందిన తిమ్మమ్మ మర్రిమాను ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా చర్యలు తీసుకోవడం, జిల్లాలోని చారిత్రక కట్టడాలు, దేవాలయాల పరిరక్షణ, జిల్లా లోని సాంస్కృతిక చరిత్ర కట్టడాలు పర్యాటక అభివృద్ధి కృషి చేయలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి,పిడి డిఆర్ డిఎ, టౌన్ ప్లానింగ్ అధికారి (పుడా), దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్, పురావస్తు శాఖ అధికారులు మరియు ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నిర్ణీత సొమ్ము కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం

## జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జెసి మౌర్య భరద్వాజ్

**పుట్టపర్తి (కలెక్టరేట్), మార్చి 04, ప్రభాతవార్త**

వంటగ్యాస్ పంపిణీలో ఎవరైనా నిర్ణీతరుసుము కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని సంయుక్త కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హెచ్చరించారు. దీపము2 పథకము, ఉజ్వలపథకం జిల్లాపౌరసరఫరాలు అధికారి నేతృత్వములో లీగల్ మెట్రాలజీ, లీడ్ బ్యాంకు మేనేజర్ మరియు గ్యాస్ ఏజెన్సీ డీలర్స్,గ్యాస్ కంపెనీ అధికారులు లతో బుధవారం సమీక్షా సమావేసము నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ, దీపము2 సంభందించిన సబ్సిడీ ఫెయిల్యూర్ కేసులకు సంభందించి బ్యాంకు మరియు గ్యాస్ కనెక్షన్స్ కు లింక్ లేనియెడల వాటిని ఈ కేవైసీ చేయాలనీ లీడ్ బ్యాంకు మేనేజర్ కు సూచించారు. గ్యాస్ ఏజెన్సీ అధికారులు, గ్యాస్ ఏజెన్సీ డీలర్ లకు సంయుక్త కలెక్టర్ అర్హులు అయిన 18 సంవత్సరలు పైబడి వారికీ ఉజ్వల పథకము కింద కొత్త కనెక్షన్స్ అందచేయాలని తెలియచేసారు. అన్ని గ్యాస్ ఏజెన్సీ ల వారు గ్యాస్ డెలివరీ చేసే ప్రతి వాహనముకు సత్యసాయి జిల్లా కు సంభందించిన క్యూ ఆర్ కోడ్ స్కాన్ ను ప్రదర్శించవలెనని తెలియచేసారు . ప్రతి లబ్దిదారుడు, డెలివరీ బాయ్ యొక్క ప్రవర్తన గురించి, రసీదు లో ఉన్న మొత్తము కంటే ఎక్కువ మొత్తము తీసుకున్న ఎడల క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మీ అభిప్రాయం తెలియచేయవచ్చునన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 08555288566 ద్వారా పిర్యాదు చేయవచ్చున్నారు.

# తాగునీటి సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ కేంద్రాలు

**పుట్టపర్తి, మార్చి 04, ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లాలో వేసవి కాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా జిల్లాకలెక్టర్ ఆదేశాలమేరకు ప్రత్యేకహెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటుచేసినట్లు జిల్లా గ్రామపంచాయతీఅధికారి, ఎస్సీ ఆర్‌డబ్ల్యుఎస్,డిపిఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చనీ, తాగునీటి ఎద్దడి, సరఫరాలో అంతరాయాలు, పైప్‌లైన్ లీకేజీలు మరియు ఇతర నీటిసంబంధిత సమస్యలగురించి తెలియచేయవచ్చన్నారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత మండలాల ఎంపీడీవోలు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈఈ తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపడతారన్నారు. వేసవి తాపాన్ని తీర్చడానికి గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లు విభాగం / ప్రాంతం హెల్ప్‌లైన్‌నంబర్ జిల్లాస్థాయి కరువునివారణ (డ్రాట్‌సెల్) + 9885721883 మడకశిర నియోజకవర్గం 9550306100హిందూపురం నియోజకవర్గం 8247625245పెనుకొండ నియోజకవర్గం 9885447204 పుట్టపర్తి నియోజకవర్గం 9490517016 కదిరినియోజకవర్గం 6281434418 ధర్మవరం నియోజకవర్గం 8328462610జిల్లాలోని 32 మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయి. మండలం హెల్ప్‌లైన్‌నంబర్లు అగలి 9640674382/9493494890 ఆమడగూరు 8074663608/9494070153 అమరాపురం 8500555054/ 8008155892 బత్తలపల్లి 9666238088/9491361765 బుక్కపట్నం 9848730243/7794838796 చెన్నేకొత్తపల్లి 9398853004/ 8639202107 చిలమత్తూరు 9346805215 / 9182516321 ధర్మవరం 6300820464/9494369273 గాండ్లపెంట9490085474/ 70133 42093 / 9440177734 గోరంట్ల 9490624837 / 9393735500 గుడిబండ 9845322996/9493347614 హిందూపురం 9966925720 / 9441190997 కదిరి9491864077/9346322398 కనగానపల్లి 9666440554/8885750459 కొత్తచెరువు8074467328/798154 2499 లేపాక్షి7799048969 / 7793969658 మడకశిర 9490860192 / 7975769013 ముదిగుబ్బ 9866723524 / 9490054313 నల్లచెరువు 8297794996/9052398691 నల్లమడ9491766865/ 9849636438 నంబులిపులికుంట 9704137303 / 7674986819 ఓబుళదేవరచెరువు 9491362411/ 9866548511 పరిగి 9493894606 / 7680898240 పెనుకొండ 8885388368 / 9160043945 పుట్టపర్తి 8008456110 / 8919952323 రామగిరి 9849915659 / 9959758504 రొద్దం 9731698864/ 9030130883 రొళ్ల 9490624634 / 9676509200 సోమందేపల్లి 8309774330/ 8985933586 తాడిమర్రి 9440635950 / 9963483677 తలుపుల 6305681917/7893356405 తనకల్లు 9381577563 / 8985730370 వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడితలెత్తకుండా అధికారులు నిరంతరంపర్యవేక్షిస్తున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

# పోలీసు సిబ్బందిని సొంత జిల్లాలకు బదిలీ చేయండి

- జిల్లాల పునర్వ్యభజన సమయంలో ఆర్డర్ టు సెర్వ్ డ్యూటీ అంటూ విభజించారు
- లోకల్ స్టేటస్ ఆధారంగా వారిని వెంటనే సొంత జిల్లాలకు బదిలీ చేయాలి
- రాష్ట్ర శాసన మండలిలో కోరిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామరెడ్డి



మండలిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

**ఉరవకొండ, మార్చి 4 ప్రభాతవార్త**

2022 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగినపుడు పోలీస్ శాఖలో ఏఆర్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని తాత్కాలిక ఆర్డర్ టు సెర్వ్ డ్యూటీ అంటూ లోకల్ స్టేటస్ నిబంధనలు పాటించకుండా విభజింపబడిన నూతన జిల్లాలకు కేటాయించారని 4 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు వారిని సొంత జిల్లాలకు పంపడంలేదని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు. బుధవారం ఆయన శాసన మండలిలో ప్రత్యేక నివేదన కింద ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాల పునర్విభజన సమయంలో డీజీపీ ఉత్తర్వులు 23-09-2022ను అనుసరించి సిబ్బంది కేటాయింపులు జరిగాయన్నారు. ఒక్క పోలీస్ శాఖలోనే ఇష్టానుసారంగా సిబ్బందిని కొత్త జిల్లాలకు విభజించడం జరిగిందన్నారు. ఇతర శాఖల్లో ఉద్యోగులను విభజించాల్సిన పద్దతి ప్రకారమే విభజించారని అయితే పోలీస్ శాఖలో మాత్రం సదరు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా పంపించారన్నారు. జిల్లాల విభజన జరిగినప్పటి నుంచి సొంత జిల్లాలు వదిలి ఏఆర్ సిబ్బంది అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వయోవృద్ధులైన, అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రులను చూసుకోలేకపోతున్నారని, పిల్లల చదువులు, కుటుంబ పరిస్థితులు, ఆర్థిక, మానసిక సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్నారన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు విన్నవించుకుంటే వారు గజిట్ అయిన తరువాత మిమ్మల్ని సొంత జిల్లాలకు పంపుతామని చెబుతున్నారని తెలుస్తోందన్నారు. ఆర్డర్ టు సెర్వ్ విధులు అనేవి తాత్కాలికమైనవి మాత్రమేనని కావున వెంటనే స్పందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా గజిట్ నోటిఫికేషన్ జారీ చేసి ఉన్నందున గత 4 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ పోలీసు సిబ్బందిని నిబంధనల మేరకు వారి వారి లోకల్ జిల్లాలను గుర్తించి సొంత జిల్లాలకు బదిలీ చేసి తగిన న్యాయం చేయాలని కోరారు. దీంతో స్పందించిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఈ విషయమై తక్షణం సానుకూల చర్యలు చేపడుతామని ప్రకటించారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వివరించారు.

# అంగరంగవైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం

- కన్నులపండువగా స్వామివారి కళ్యాణం - భక్తజనసంద్రంగా యాడికి




స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం , కళ్యాణంలో పాల్గొన్న భక్తులు




లక్ష్మీచెన్నకేశవస్వామిని అలంకరించిన దృశ్యం, స్వామివారి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**యాడికి, మార్చి 4 ప్రభాతవార్త**

యాడికి మండల కేంద్రంలో వెలసిన శివలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణం వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కన్నులపండువగా నిర్వహించారు. వేదపండితులు శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో శోభాయమానంగాఅలంకరించి కళ్యాణోత్సవంనిర్వహించారు. స్వామి వారి కళ్యాణం తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. అనంతరం లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో వుంచి మండపం నుండి రథం వరకు తీసుకొచ్చి అక్కడహోమం నిర్వహించారు. స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఆశీనులు చేశారు. భక్తుల చెన్నకేశవా గోవింద నామంతో ఆద్యంతం మారుమ్రోగింది. ముందు మడుగు తేరులాగారు. అనంతరంస్వామివారి రథోత్సవాన్ని మెయిన్ బజార్, పాతపోలీస్‌స్టేషన్, వేములపాడు మీదుగా లాలాలవీధి, పెద్దమ్మఆలయం మీదుగా రథోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలిరావడంతో యాడికి భక్తజనసంద్రంగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఇఒ దుర్గాప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కళ్యాణోత్సవంలో తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు, అధికారులు, భక్తులుపాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, రంగులరాట్నాలు, గాజుల దుకాణాలు భక్తులతో సందడిగా మారాయి. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళ్యాణోత్సవం, రథోత్సవంలో నాయకులు బొంబాయి రమేష్‌నాయుడ, బాల రమేష్‌బాబు, కాసా చంద్రమోహన్, దడియాల ఆదినారాయణయాదవ్, రాజశేఖర్, తదితర నాయకులు, దేవాదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా సిఐ శ్రీనివాసులు, ఎస్ఐతో పాటు పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు, పెద్దపప్పూరు, తాడిపత్రి ఎస్ఐలు పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# లేపాక్షి విశ్రాంత ఎంపిడిఓ నిధుల దుర్వినియోగంపై విచారణ

## - రూ.16 లక్షలు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు !



విచారణ చేపడుతున్న డిడిఓ

**లేపాక్షి, మార్చి 4 ప్రభాతవార్త**

లేపాక్షి మండల విశ్రాంత మండల అభివృద్ధి అధికారి నరసింహమూర్తి హయాంలో జరిగినట్లు గా వస్తున్న నిధుల దుర్వినియోగం ఆరో పణలపై బుధవారం జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. విశ్రాంత ఎంపిడిఓ నరసింహమూర్తి నిధులు దుర్వినియోగం చేసినట్లు జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ జిల్లా పరిషత్ సీఈఓను నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. జెడ్‌పి సీఈఓ ఆదేశాల మేరకు పెనుకొండ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణ మండల కార్యాలయంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. గతంలో ఎంపిడిఓగా పనిచేసిన నరసింహామూర్తి నిధులను నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారన్న ఫిర్యాదులపై కార్యాలయ రికార్డులను సమగ్రంగా పరిశీలించారు.

**రికార్డుల తనిఖీ :** ఎంపిడిఓ కార్యాలయంలోని క్యాష్ బుక్స్, పనులకు సంబంధించిన ఓచర్లు మరియు ఇతర కీలక రికార్డులను విచారణాధికారి రామకృష్ణ క్షుణ్ణంగా పరిశీలించారు.

**నివేదిక సమర్పణ :** విచారణలో తేలిన అంశాలను సమగ్ర నివేదిక రూపంలో జిల్లా పరిషత్ సీఈఓకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విచారణాధికారి స్పష్టం చేశారు.




లేపాక్షి ఎంపిడిఓ కార్యాలయం